# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# జీఎస్డీపీపై కేసీఆర్ ముద్ర

**తెలంగాణ** ఇప్పుడు ఓ విజయ గాథ. నిన్నటి వెనుకబాటుతనం గత చరిత్ర అయిపోయింది. నేడు తెలంగాణ సమున్నత సగర్వ పతాక విశ్వవీధుల్లో రెపరెపలాడుతున్నది. వరుస విజయాలు, కీర్తికిరీటాలు వరించి వైభవోజ్వల పథంలో ముమ్ముందుకు సాగుతున్నది. ప్రగతికి మారుపేరుగా, దేశానికే ఆదర్శ రాష్ట్రంగా విలసిల్లుతున్నది. తాజాగా జీఎస్డీపీ లెక్కల్లో అగ్రస్థానంలో నిలవడమే అందుకు సాక్ష్యం. స్వరాష్ట్ర సాధన అనంతరం కేసీఆర్ ప్రభుత్వం అందించిన దీక్షాదక్షతల నాయకత్వమే తెలంగాణను నేడు ఈ స్థాయిలో నిలబెట్టిందనడంలో ఎలాంటి సందేహం లేదు. దశాబ్ద కాలంలో ఒక్కొక్క రంగం ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ అభివృద్ధిలో ఆకాశపు అంచులు తాకడం మనమంతా కండ్లారా చూశాం. 2022-23 ఆర్థిక సంవత్సరంలో అసాధారణమైన రీతిలో 11.97 శాతం వృద్ధి సాధించింది. రూ.3,08,732 కోట్ల జీఎస్డీపీతో 10 అత్యుత్తమ రాష్ట్రాల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. సుమారు తొమ్మిదిన్నరేండ్ల కాలంలో కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయం, మౌలిక రంగాల్లో సాధించిన అద్భుత ఫలితాల వల్లనే ఇది సాధ్యమైందని ఆర్థికవేత్తలు అంటున్నారు.

అస్తిత్వ పోరాటం ఫలించి స్వరాష్ట్రం సాధించుకున్నప్పుడు ఎట్లుండె తెలంగాణ? కరువులు, వలసల చక్రభ్రమణంలో నలిగిపోయి నీరసించిచిది తెలంగాణ. అభివృద్ధికి ఆమడదూరంలో ఉండిపోయి మూలుగుతున్నది తెలంగాణ. తాగేందుకే నీళ్లు లేని గోస. ఇక సాగుకు నీరెక్కడ.. సాగు బాగుపడి రైతన్న బతుకులో చీకట్లు తొలగిపోయేదెప్పుడు? పరాయిపాలన దోపిడి కింద అణగారిన తెలంగాణ తలెత్తుకునేదెప్పుడు..? ఇవీ తెలంగాణను నిత్యం తొలిచివేసిన ప్రశ్నలు. రాష్ట్ర పగ్గాలు చేపట్టిన తర్వాత కేసీఆర్ ఆర్థిక వ్యవస్థకు ఆధారభూతమైన వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి నిలిపారు. పంట పెట్టుబడి సాయం కింద ఏటా రూ.10 వేల నగదును రైతుల ఖాతాల్లో జమ చేయడంతో పాటు మిషన్ కాకతీయ వంటి బృహత్తరమైన పథకంతో వేలాది చెరువులకు మరమ్మతులు నిర్వహించి వాటికి జీవం పోశారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరందించి ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొట్టారు. మనుషుల దాహాన్ని, మట్టి దాహాన్ని తీర్చి పచ్చని భవితకు బాటలు పరిచారు. వ్యవసాయ, అనుబంధ రంగాలను అద్వితీయమైన రీతిలో అభివృద్ధి చేశారు.

ఇవాళ జీఎస్డీపీలో మనం శిఖరాగ్రంపై నిలవడానికి దూరదృష్టితో సాధించిన ఈ అభివృద్ధే మూలమని చెప్పకతప్పదు. పంట పెట్టుబడి నుంచి దిగుబడి కొనుగోలు వరకూ అన్ని దశల్లో రైతన్నకు అండగా నిలిచి ముందుకు నడిపించారు. కాళేశ్వర సుజలాలతో మెట్ట మాగాణమై వరి పంటలో తెలంగాణ పంజాబ్‌ను అధిగమించింది. అటు మౌలికరంగం అభివృద్ధితో, సులభ వాణిజ్య విధానాలతో పారిశ్రామికరంగాన్ని బలోపేతం చేశారు. భారీ ఐటీ, ఐటీయేతర కంపెనీలు తెలంగాణకు బారులు తీరడమే ఇందుకు నిదర్శనం. పెట్టుబడులు వెల్లువెత్తాయి. ఉపాధి అవకాశాలు మెరుగై తిరుగు వలసలు మొదలయ్యాయి. విద్యారంగంలో కనీవిని ఎరుగని ప్రగతి సాధించి, వైద్యసేవలను ప్రజల అవసరాల మేరకు విస్తరించి భరోసా కల్పించారు. వీటన్నిటి ఉమ్మడి ఫలితంగానే ఇవాళ తెలంగాణ అభివృద్ధికి నమూనాగా నిలిచింది. ఇదీ కేసీఆర్ పాలనా ముద్ర. ఓడిపోయిన తెలంగాణను గెలిపించిన పాలనా పటిమ. ఇదీ జీఎస్డీపీలో తెలంగాణను నంబర్ వన్‌గా నిలబెట్టిన సమర్థ నేతృత్వం. ప్రజలు పదేపదే గుర్తు చేసుకుంటున్న స్వర్ణయుగం.




# మన చదువులు మెరుగుపడేదెలా?

> పురాతన ఇతిహాసాలైన రామాయణం, మహాభారతంలో ఆనాటి నుంచి ఉన్న భౌగోళిక చిత్రం గురించి సుస్పష్టంగా వివరించారు ఆ కవులు, రచయితలు. ప్రస్తుతం భారతదేశం పేరిట ఒక్క దేశంగా ఏర్పడిన ప్రాంతం విదేశీ దండయాత్రల ముందుదాకా అనేక రాజ్యాలుగా ఉండి వివిధ వంశాలకు చెందిన రాజుల పరిపాలనలో ఉన్నది. మొఘలులు, తర్వాత బ్రిటిష్ వారు పాలించిన కాలంలోనే ఈ ప్రాంతాలన్నీ ఒకే పరిపాలనలోకి వచ్చి ఒకే దేశంగా రూపుదిద్దుకున్నాయి. అయితే శతాబ్దాల కాలం వివిధ రాజ్యాలుగా ఉండి, ఇప్పుడు మనం రాష్ట్రాలుగా పిలుస్తున్న ఈ ప్రాంతాలన్నీ వారివారి సొంత భాష, సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు అనుసరించటంతో, ఈ రోజుకీ ఏ రెండు రాష్ట్రాలు ఒకేలా ఉండవు.



కనకదుర్గ దంటు
89772 43484



ఒకే దేశంగా రూపుదిద్దుకున్న భారతదేశం అద్భుతమైన వైవిధ్యం కలిగి ఉంటుంది. మరి ఇటువంటి దేశానికి ఎటువంటి పాలకులు ఉండాలి? స్వతంత్ర దేశంగా ప్రకటితమైన భారతదేశం 1947 నుంచి ఈనాటిదాకా సరైన పాలన రుచి చూడలేదు. ఏ దేశమైనా ఆయా పౌరుల జీవన విధానం ప్రకారం విధానాలను తయారు చేసుకొని వాటిని అనుసరిస్తూ జీవిస్తే, ప్రజల సాంస్కృతిక, సామాజిక, వ్యక్తిగత జీవితం ఆనందదాయకమవుతుంది. దానికి సరైన విద్యావిధానం తోడైతే ఆ సమాజంలో మేధావులు తయారవుతారు. అంతర్జాతీయంగా ఖ్యాతి పొందుతారు.

మొట్టమొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ కాలం నుంచి ఈ రోజుదాకా పైన చెప్పిన అంశాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా, తాము రూపొందించిన విధానాలను ప్రజల మీద రుద్దుతూ పరిపాలన సాగించారు అందరు ప్రధానులూ. కేంద్ర ప్రభుత్వాలు కూడా. ఈ అంశం అర్థం చేసుకోవటానికి ఒక్క ఉదాహరణ చూద్దాం! ప్రజల మేధస్సు వికసించటానికి విద్య ఒక్కటే మార్గం. సరైన విద్యా విధానం ద్వారానే ఒక జాతిని బలోపేతం చేయగలం. 1950 నుంచి కూడా ఏ విద్యావేత్త దేశీయ, స్థానిక అంశాలు పరిగణిస్తూ విధానాలు రూపొందించలేదు. నెహ్రూ విదేశాల్లో చదువుకొని, ఆ విద్యారంగ విధానాలకు ఆకర్షితుడై వాటిని మన విద్యారంగంలో జొప్పించాలని చూశారు కానీ, ఇక్కడి వైవిధ్యాల ప్రకారం విద్యారంగాన్ని రూపొందించాలని భావించలేదు. అసలు విద్య గరపటానికి అతి ముఖ్యమైన మాధ్యమం విషయంలోనే తప్పటడుగులు వేసినవారికి, ఇక ఉన్నత విద్య గురించి ఏం అర్థమవుతుంది? ప్రపంచంలో ఏ దేశంలోనైనా కనీసం 3 లేదా 4 భాషలు మాట్లాడేవారుంటారు. కానీ, ఒక్క భాష మాతృభాషగా కలిగినవారు 70 శాతం పైన ఉంటారు. మిగతావారు పుట్టినప్పటి నుంచి ఈ అత్యధికులు మాట్లాడే భాష మధ్య పెరుగుతారు కాబట్టి వారికి తమ మాతృభాషతో పాటు ఈ భాష కూడా వస్తుంది. అందుకే ప్రపంచ దేశాలన్నీ తమ జాతీయ భాషగా గుర్తించిన అత్యధికులు మాట్లాడే భాషనే తమ విద్యారంగంలో మాధ్యమంగా చేసుకుంటారు. విద్య పూర్తిచేశాక, అవసరమైన విదేశీ భాష-ఇంగ్లీషు వంటిది నేర్చుకొని ఉద్యోగ ఉపాధులు వెతుక్కుంటారు. అందుకే వారికి తమ భాష వస్తుంది, అవసరార్థం పట్టుదలగా నేర్చుకున్న ఇతర భాషా వస్తుంది. మరి మన విధానం చూడండి. భారతదేశంలో భాషల అవసరాన్ని గుర్తించినా, సరైన విధానం లేక ప్రాథమిక దశ నుంచీ చిన్న పిల్లలకు విద్య చాలా భారమవుతున్నది. దీనికి గల కారణాలు కనుక్కోవడం కష్టం కాదు. ఇతర దేశాల్లో ఒకటో తరగతిలో చేరి బోధనకు అలవాటుపడిన పిల్లలకు రెండో తరగతి నుంచి విజ్ఞాన, సామాజిక శాస్త్రాల్లో చిన్నచిన్న విషయాలు బోధిస్తారు. అవి కూడా ఆ పిల్లలకు, జీవితాలకు పనికివచ్చేవి. చిన్న చిన్న సైన్స్ ప్రయోగాలు, రోడ్డు క్రాస్ చేసేటప్పుడు పాటించాల్సిన భద్రతా విధానాలు వారి మాతృభాష ద్వారా, ఆచరణాత్మకంగా చేయిస్తూ బోధిస్తారు. అందుకే వారికి విద్య, బోధన, తాము నేర్చుకోవటం చాలా సరదాగా, ఉత్సాహంగా ఉంటుంది. ఇక మన దేశంలో ప్రాథమిక విద్యార్థుల పాట్లు చూద్దాం. ఇక్కడ 3 భాషలు- మాతృభాష, జాతీయ భాష హిందీ, అంతర్జాతీయ భాష ఇంగ్లీషు- ఒకటో తరగతి నుంచీ తప్పనిసరిగా నేర్చుకోవాలి. బాగానే ఉంది. ఎందుకంటే చిన్నపిల్లలు భాషలను త్వరగా నేర్చుకుంటారు గనుక. వీటికి తోడు ఒక లెక్కలు మాత్రం ఇంగ్లీషులో పెట్టి వారికి ప్రయోగాత్మకంగా నేర్పిస్తే బాగుంటుంది. కానీ, అది చేయరు. ఒకటో తరగతి నుంచి ఈ భాషలకు తోడు సైన్స్, సోషల్ స్టడీస్, జనరల్ నాలెడ్జి, ఇంకా మోరల్ సైన్స్ వంటివి రెండు, మూడు సబ్జెక్టులు తగిలిస్తారు. విదేశీ విద్యావేత్తలు ఈ విధానాన్ని చూసి నవ్వుతారు. భాషే సరిగా రానివాడికి సైన్స్, సోషల్ స్టడీస్ వంటి విషయాల ఆధారిత సబ్జెక్టు పెట్టకూడదని భాషావేత్తలు, మనోవైజ్ఞానిక శాస్త్రవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు చెప్తారు. కనుక, మన దేశంలో ప్రాథమిక దశలో 3 భాషలు, లెక్కలు మాత్రం బోధించి, చిన్న పిల్లలకు ఆటలు, పాటలు, సంగీతం, నృత్యం, చిత్రకళ వంటివి నేర్పితే వారికి ఉత్సాహం పెరుగుతుంది. కళలు, భాషల ద్వారా భావనాశక్తి పెరుగుతుంది.

> విద్యార్థులకు ముఖ్యంగా నేర్పవలసిన నైపుణ్యాలు మన దేశ విద్యా విధానంలో అసలు కనపడవు. అవి- ఒక విషయాన్ని వివరించే నైపుణ్యం, విశ్లేషించే నైపుణ్యం, సృజనాత్మక, భావనాత్మకంగా ఆలోచించే విధానం. వీటిని మనం పూర్తిగా నిర్లక్ష్యం చేశాం. అందుకే పట్టభద్రులై మంచి మార్కులు తెచ్చుకున్న యువత కూడా ఇంటర్వ్యూలలో విఫలమవుతారు. టెక్నికల్ విషయాలు- తాము చదువుకున్నవి- చెప్పగలరు కానీ, 'నీ గురించి చెప్పు' అంటే తడబడతారు. ఎందుకంటే పుస్తక పాఠ్యాంశాల గురించి తప్ప వారు ఏమీ ఆలోచించలేరు.

ఈ నైపుణ్యం కొరవడిన కారణంగానే ఇప్పుడు మానవ సంబంధాలు కూడా కుంచించుకుపోతున్నాయి. విద్యారంగంలో ఉన్న అనేక లోపాల్లో ఇదొక ముఖ్యమైన, చిన్నది మాత్రమే! ఇంకా అనేకం ఉన్నాయి.

మరి ఈ వైవిధ్యభరితమైన దేశానికి, ప్రతి రాష్ట్రం తన అస్తిత్వాన్ని కాపాడుకుంటూ ప్రగతిపథంలో పయనించాలంటే మార్గం ఏమిటి? ప్రజలందరూ ఇప్పటిదాకా పాలించిన రెండు జాతీయపార్టీలను విస్మరించి, తమ ప్రాంతీయత అర్థం చేసుకునే పార్టీని ప్రతి రాష్ట్రంలో ఎన్నుకోవాలి. వివిధ పార్టీలు కలిసి కేంద్రంలో పాలన చేపట్టాలి. అమెరికాలో ఉన్నట్టు ఆ స్థానిక ప్రజల సంస్కృతిని బట్టి ప్రతి రాష్ట్రానికి ఒక రాజ్యాంగం రూపొందించుకోవాలి. విద్యావిధానం దగ్గరి నుంచి, నీటిపారుదల, గనులు మొదలైన అన్నిరంగాల మీద ఆ రాష్ట్రానికే అధికారం ఉండాలి. ఎన్నికైౖ కేంద్ర ప్రభుత్వంలో పాలుపంచుకున్న ప్రతి రాష్ట్రం ఇతర రాష్ట్రాల వైవిధ్యాన్ని గౌరవించి నిలబెట్టాలి. అన్ని రాష్ట్రాలు తమ ఆదాయంలోంచి 10 శాతం ఈ కేంద్ర ప్రభుత్వానికే ఇవ్వాలి. అంతర్రాష్ట్ర సమస్యలు తీర్చటానికి ఈ డబ్బును వాడుకోవాలి. దీనివల్ల ప్రతి రాష్ట్రం తన వనరుల మీద, పాలన మీద, విధానాల మీద పూర్తి అధికారం కలిగి ఉంటుంది. ఇతర రాష్ట్రాల వలన తనకు కావాల్సిన విషయాలను చర్చల ద్వారా తీర్చుకోవాలి. నిర్ణయించుకోవాలి. కేంద్ర, రాష్ట్రాల మధ్య వైషమ్యాలు ఇప్పుడున్నట్టు ఉండే అవకాశం అసలు ఉండదు. పరస్పర గౌరవం ఈ ప్రభుత్వంలో ముఖ్యమైనది.

అయితే ఇటువంటి పాలన, తమ కరుడుగట్టిన విధానాల ద్వారా ప్రవర్తించే కాంగ్రెస్, బీజేపీలకు అర్థం కాదు, చేత కాదు. అందుకే ఒక కొత్త పార్టీ అన్ని ప్రాంతీయ పార్టీల నాయకులతో కేసీఆర్ వంటి విశాల భావాలు, సమానత్వ గౌరవం, మానవీయత కలిగిన నాయకుడు నడిపే పార్టీగా కేంద్రంలో అధికారంలోకి రావాలి. ప్రతి రాష్ట్రం తన ప్రతిపత్తిని నిలబెట్టుకుంటూ, ఇతర రాష్ట్రాల పట్ల స్నేహ సౌహార్ద్రాలు కలిగి ఉండటం చాలా ముఖ్యం. ప్రగతి సాధించిన రాష్ట్రాలు ఇతర రాష్ట్రాలకు తమ విధానాల గురించి వివరించడం, వారికి సహాయం చేయటం చాలా అవసరం. మన ముందు ఇప్పటి పాలకుల అవినీతి, నిర్లక్ష్యం వల్ల 140 కోట్ల జనాభా ఉన్న మనకు నోబెల్ బహుమతి వంటి ప్రతిష్ఠాత్మక అవార్డులు సాధించేవారు లేకపోవడం విషాదం. కేవలం 20 లక్షల జనాభా ఉన్న దేశంలో 4, 5 నోబెల్ బహుమతులు పొందినవారు ఉండటం ఇక్కడున్న రాజకీయ, సామాజిక, విద్యా విధానాల ఫలితమే అన్నది గ్రహించాలి. అందుకే మన దేశంలో కూడా ఒక్కొక్క రాష్ట్రం తన మీద తను శ్రద్ధ పెడితే, మన యువత మేధావులవుతారు, అంతర్జాతీయ సంస్థల కూలీలు కాకుండా ఉంటారు!

> సార్వత్రిక ఎన్నికలొస్తున్నాయి ప్రతి రాష్ట్రంలో. ప్రజలందరూ అప్రమత్తమై, ఇప్పటిదాకా బాగా పాలించిన పార్టీ- వీలైతే ప్రాంతీయ పార్టీని బలోపేతం చేసి గెలిపించుకోవటం ముఖ్యం. విఫలమైన రెండు జాతీయ పార్టీలుకాంగ్రెస్, బీజేపీలను కేంద్రంలో అధికారంలోకి రానీయకూడదు. రాష్ట్రాల్లో గెలిచిన ఈ ప్రాంతీయ పార్టీల కూటమి కేంద్రంలో అధికారం చేపట్టి భారత దేశాన్ని రాష్ట్రాల సమాహారంగా తీర్చిదిద్దాలి. ఇప్పుడున్న వివక్షాపూరిత, అవినీతి పరిపాలనను కేంద్రంలో రూపుమాపాలి.



# ప్రజల గుండెల్లోంచి చెరపలేరు

> ప్రత్యేక రాష్ట్రం ఏర్పడకముందు తెలంగాణ ఎంత బాధపడ్డదో.. మళ్లీ తెలంగాణ ప్రజలు ఇప్పుడు అంతగా బాధపడుతున్నారు. సంక్షేమ సారథిని వదులుకున్నామా? అనే ఆత్మవిమర్శ ప్రజల్లో ఇప్పటికే మొదలైంది.

ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన పోరాటంలో ఏ ఒక్కరూ ఉద్యమ నేత బాటలో నడవడానికి ముందుకు రాలేదు. మహామహులమని చెప్పుకొనే వారంతా ఆనాడు ఆంధ్రా పెత్తందారుల కింద అణిగిమణిగి ఉన్నారు. అయినా కేసీఆర్ ఒక్కరే ఒక శక్తిగా మారి తను నమ్ముకున్న నలుగురితో కలిసి తెలంగాణ సిద్ధాంతాన్ని నలువైపులా వ్యాపింపజేశారు. సబ్బండ వర్గాలను ఏకం చేసి తెలంగాణకు జరుగుతున్న అన్యాయంతో పాటు తెలంగాణ వస్తే మారబోయే బతుకులపై ఆయన ఆనాడే వివరించారు. వాస్తవానికి కేసీఆర్‌కు పదవులే కావాలనుకుంటే తెలంగాణ ఉద్యమం చేయాల్సిన అవసరం లేదు. తన రాజకీయ జీవితంలో ఆయన ఎన్నో పదవులను అనుభవించారు. పదవులను త్యజించి, తెలంగాణ సాధనే లక్ష్యంగా 14 ఏండ్ల పాటు నిర్విరామంగా పోరాటం చేసి ప్రజల్లో ఆయన చైతన్యాన్ని తీసుకొచ్చారు. తిరుగుబాటును రగిల్చి ప్రజల మద్దతుతో ప్రత్యేక రాష్ట్రం కలను సాకారం చేశారు. సాధించుకున్న తెలంగాణకు అయిన అనేక గాయాలకు కేసీఆర్ ఓ ఔషధంగా మారారు. 60 ఏండ్ల సమైక్య పాలన చేసిన ఒక్కో గాయాన్ని మటుమాయం చేశారు. రాష్ట్రం కల సాకారమైన మరుక్షణం నుంచే క్షేత్రస్థాయిలో దృష్టి సారించి పతనమైన వ్యవస్థలన్నింటిని చక్కదిద్దారు. అభివృద్ధి, సంక్షేమంలో తన ప్రత్యేకతను చాటారు.

తెలంగాణలో కేసీఆర్ ప్రవేశపెట్టిన అన్ని పథకాలు మానవీయ పథకాలే. ప్రజలకు ఉపయోగకరమైన, ప్రజలపై ఉన్న భారాన్ని దించే పథకాలే. వాస్తవానికి గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వ్యతిరేకించిన వారు కూడా వాటిని సద్వినియోగం చేసుకున్నారు. రైతుబంధును వ్యతిరేకిస్తూనే వందల ఎకరాలు ఉన్న వివిధ పార్టీల నాయకులు పథక లబ్ధిని పొందారే కానీ, తమకు అక్కర్లేదు అని వెనక్కి పంపలేదు. పథకాల లబ్ధి పొందుతూనే కేసీఆర్‌ను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ ఎన్నికల్లో లబ్ధి పొందారు.

కేసీఆర్ రాజకీయ జీవితంలో ఓటములు కొత్తేమీ కాదు. తెలంగాణ ఉద్యమ సమయంలో హేళనలు, అవహేళనలను ఎన్నోసార్లు ఆయన ఎదుర్కొన్నారు. అయినా పట్టు వదలని విక్రమార్కునిలా ప్రత్యేక రాష్ట్ర కాంక్షను సాకారం చేసేదాకా విశ్రమించలేదు. అటువంటి నాయకుడు ప్రజా తీర్పును గౌరవించి హుందాగా ప్రగతి భవన్‌ను ఖాళీ చేశారు. అనంతరం సాదాసీదాగా తన సొంత ఫామ్‌హౌస్‌కు వెళ్లిపోయారు. ఫామ్‌హౌస్‌లో ఉన్న ఆయన్ను కలిసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు తండోపతండాలుగా తరలివెళ్లారు. తమ ప్రియతమ నేతను కలిసి అభిమానాన్ని చాటుకున్నారు. జనం గుండెల్లో కేసీఆర్ ఎంతగా స్థానం సంపాదించారో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాణ స్వీకారానికి ముందే కంచె తొలగింపు పేరిట హడావుడి చేసింది. కానీ, ఆ కంచె ఏర్పాటు చేసిందే ఉమ్మడి ఏపీలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అనే విషయాన్ని మరువకూడదు. తెలంగాణ ఉద్యమం కారణంగా అప్పట్లో కంచె వేసిన విషయం అందరికీ తెలిసిందే. అసలు విషయాన్ని పక్కదారి పట్టించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కేసీఆర్ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేయడం సిగ్గుచేటు. ప్రభుత్వ పరిపాలనా వ్యవహారాల్లో అక్కడక్కడా లోపాలు ఉండటం సహజమే. వాటిని విధాన పరంగా చూడాలే తప్పా.. వ్యక్తిగతంగా కాదు. చిన్న చిన్న విషయాలను ఎత్తిచూపుతూ కేసీఆర్‌ను వ్యక్తిగతంగా విమర్శిస్తూ తాత్కాలిక ఆనందంలో మునగడం మంచిది కాదు. ఎన్నికల ప్రక్రియలో గెలుపోటములు సహజం. ఈ విషయాన్ని పక్కనపెట్టి ఆయన ఆరోగ్య పరిస్థితులపై కూడా వ్యంగ్యంగా మాట్లాడడం సబబు కాదు. ఎవరూ అవునన్నా కాదన్నా అరవై ఏండ్లుగా అణచివేతకు గురైన తెలంగాణను తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి సాధించిన వ్యక్తిగా ప్రజల గుండెల్లో కేసీఆర్ చిరస్థాయిగా నిలిచిపోయారు. తెలంగాణ ప్రజల గుండెల్లోంచి ఆయనను ఎవరూ చెరపలేరు.



సంపత్ గడ్డం
78933 03516

## కొమ్మలకు కొత్త ఆకులు

ప్రతి చెట్టుకు ఆకులు
రాలుతాయి
ఆకులు రాలిపోయినంత
మాత్రాన
చెట్టు మొండి
మానవుతుందా..?

మానులో బలమున్నంతవరకు
మండలు చిగురిస్తూనే
ఉంటాయి
కొమ్మలకు కొత్త ఆకులు
పుడుతూనే ఉంటాయి

అది ప్రకృతి ఆనవాయితీ
ఆకు రాలడం ఆకు
చిగురించడం
మాను మతి తప్పదు
కొత్త చిగురు తొడిగిస్తుంది

పాత ఆకు రాలితే
కొత్త ఆకు పుడుతుంది
కొత్తది, పాతవుతుంది
పాతది, కొత్తగవుతుంది

పండుటాకు రాలితే పసరాకు
నవ్వుతుంది
పసరాకు పండుదై రాలుతానని
యాదిమరిచి అది నవ్వుతుంది!



దేవరపాగ కృష్ణయ్య
99634 49579

# దేశంలో పౌరహక్కులకు రక్షణేది?

**భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ గారికి...**




ప్రజాస్వామ్య నైతికత, పౌర, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం పోరాడే భావాలు కలిగిన పౌరహక్కుల కార్యకర్తలుగా మేము ఈ లేఖను రాస్తున్నాం. ఈ లేఖ ద్వారా మీకు ఓ విజ్ఞప్తి చేయదలచుకున్నాం. మన దేశంలో ప్రశ్నార్థకంగా మారిన ప్రజల వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ గురించి ఈ లేఖలో ప్రస్తావిస్తున్నాం. రాజ్యాంగం ద్వారా రక్షణ పొందిన ఈ హక్కుల క్షీణతను మనం చూస్తునే ఉన్నాం.

మన దేశంలో కొంతకాలంగా వింత ధోరణి కనిపిస్తున్నది. ప్రజల వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛలకు సంబంధించిన ర్యాలీలు, శాంతియుత నిరసనలు, సమావేశాల అనుమతి నిరాకరణ ట్రెండ్ దేశంలో నడుస్తున్నది. గతేడాది డిసెంబర్ 10న ఇటువంటి తాజా ఘటన జరిగింది. ఆ రోజు ప్రపంచమంతా ఐరాస 75వ 'మానవ హక్కుల దినోత్సవం' జరుపుకొన్నది. కానీ, మన దేశ రాజధాని ఢిల్లీ పోలీసులు ఈ కార్యక్రమ నిర్వహణకు అనుమతిని నిరాకరించారు. కొన్నిరోజుల ముందుగానే అనుమతి తీసుకున్నప్పటికీ, క్యాంపెయిన్ ఎగెనెస్ట్ స్టేట్ రిప్రెషన్ (సీఏఎస్ఆర్) తదితర 40 సంస్థలకు డిసెంబర్ 9న రాత్రి 9.15 గంటలకు సంబంధిత సమాచారం ఇచ్చారు. గతేడాది మార్చి 15న కశ్మీర్‌లో జరగాల్సిన 'కశ్మీర్‌లో మీడియాపై అణచివేత' కార్యక్రమం విషయంలోనూ ఇలాగే జరిగింది. కార్యక్రమానికి 2 గంటల ముందు నోటీసులిచ్చి.. సదస్సు జరగాల్సిన గాంధీ పీస్ ఫౌండేషన్ వేదికను బారికేడ్లతో దిగ్బంధించారు. జమ్మూ కశ్మీర్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ హుస్నేన్ మసూదీ సహా అనేకమంది మాజీ ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, మానవ హక్కుల కార్యకర్తలు ఈ సదస్సులో ప్రసంగించాల్సి ఉన్నది. మార్చిలో ఢిల్లీలోని హెచ్‌కేఎస్ సుర్జీత్ భవన్‌లో నిర్వహించతలపెట్టిన 'భారత్ బచావో జాతీయ సదస్సు'కు ఇదే సమస్య ఎదురైంది. శాంతిభద్రతలు సాకుగా చూపి ఇలా అనేక సమావేశాలకు పోలీసులు అనుమతులు నిరాకరిస్తున్నారు.

'స్వేచ్ఛను త్యజించటం అంటే మనిషిగా ఉండటాన్ని త్యజించటం, మానవత్వపు విధులు, హక్కులను అప్పగించటం' అని ఫ్రెంచ్ తత్వవేత్త, ప్రజాస్వామ్యవాది జీన్ జాక్వెస్ రూసో చెప్పారు. 'శాంతియుతంగా నిరసనలు తెలపడం ప్రజల ప్రాథమిక హక్కు. దాన్ని ఏకపక్ష కార్య నిర్వాహకులు లేదా శాసన చర్యల ద్వారా ప్రజల నుంచి దూరం చేయలేరు' అని గతంలో ఓ కేసు విచారణ సందర్భంగా దేశ సర్వోన్నత న్యాయస్థానం కూడా చెప్పింది. కానీ, పౌర హక్కుల అణచివేతపై నిరసన తెలిపేందుకు పూనుకున్న సీఏఎస్ఆర్, అనుబంధ సంస్థల కార్యకర్తలు, నిరసనకారులపై సాయుధ దళాలు, పోలీసులు దాడులకు పాల్పడ్డారు. కాల్పులు జరుపుతామని మహిళలు, ఎల్జీబీటీ కార్యకర్తలను రాష్ట్రపతి భవన్ ఎదుటే బెదిరించారు. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన ఓ జర్నలిజం విద్యార్థిని పోలీసులు కిరాతకంగా చితకబాదారు. ప్రైవేటు వేదికల్లో శాంతియుత నిరసన, సమావేశాలు నిర్వహించాలనుకుంటే.. బారికేడ్లు ఏర్పాటుచేసి ఆ వేదికల యజమానులను బెదిరింపులకు గురిచేస్తున్నారు. జంతర్ మంతర్ తరహా ప్రదేశాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని అనుకుంటే.. ఏమీ చేయలేని విధంగా చివరి నిమిషంలో అనుమతులు రద్దు చేస్తున్నారు. నిరసనల్లో పాల్గొంటున్న కార్యకర్తల కుటుంబసభ్యులకు ఫోన్లు చేసి మరోసారి నిరసనల్లో భాగం కాకుండా చూడాలని హెచ్చరిస్తున్నారు.

మాతో పాటు దేశంలోని పలు వర్గాలను ప్రభావితం చేస్తున్న అనేక అంశాలివీ. తమ సమస్యలు, ఆందోళనలు, అసమ్మతులను లేవనెత్తడానికి ప్రజలను అనుమతించకపోతే.. మనది అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం ఎలా అవుతుంది? ఒక సమావేశంలో రిటైర్డ్ హైకోర్టు జడ్జికి మాట్లాడే అవకాశం లేకపోతే, మాజీ ప్రజాప్రతినిధులకు ప్రసంగించే హక్కు లేకపోతే, దేశంలోని సామాన్యులైన పేద ప్రజలకు వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ ఎలా ఉన్నట్టు? మన దేశంలో ఆందోళనకరంగా పరిణమిస్తున్న ప్రస్తుత పరిస్థితులను ఈ లేఖ ద్వారా మీ దృష్టికి తీసుకురాదలచుకున్నాం. కాబట్టి దీన్ని సుమోటోగా స్వీకరించి ప్రజా హక్కులను పరిరక్షించాలని వేడుకుంటున్నాం. ఈ లేఖ పట్ల సానుకూలంగా స్పందించి.. శాంతిభద్రతల పేరిట హక్కుల అణచివేతకు పాల్పడుతున్న పోలీసులు, పరిపాలనా యంత్రాంగాలను ప్రజాస్వామ్య పద్ధతిలో నడుచుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేస్తుందని ఆశిస్తున్నాం.

**- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు 135 మంది పౌరహక్కుల కార్యకర్తలు, విద్యావేత్తలు, మేధావులు రాసిన బహిరంగ లేఖ సారాంశం**